



సాగునీటి సంఘాల ఎన్నికల నిర్వహణపై చర్చ

ప్రజాశక్తి-కందుకూరు : కందుకూరు నియోజకవర్గం టిడిపి కార్యాలయంలో సాగు నీటి సంఘాల ఎన్నికలు, నోటిఫికేషన్, నిర్వహణపై నాయకులతో ఎంఎల్ఎ ఇంటూరి నాగేశ్వరరావు సమీక్ష చేశారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ నాగేశ్వరరావు మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వంలో పాలనలో సాగు నీటి వ్యవస్థ సర్వనాశనం చేశారన్నారు. వ్యవస్థలకు సరైన కేటాయింపులు లేక సాగు నీటి సరఫరా వ్యవస్థలను నిర్వీర్యం చేశారన్నారు. సాగునీటి వ్యవస్థకు పునర్జీవనం కల్పించాలని సిఎం నారా చంద్రబాబునాయుడు సంకల్పం మేరకు సాగు నీటి సంఘాలకు ఎన్నికలు జరగనున్నాయన్నారు. అందరూ కష్టపడి అన్ని చోట్ల కూటమి అభ్యర్థులు విజయానికి కృషి చేయాలని సూచించారు. వలేటివారిపాలెం మండల పార్టీ అధ్యక్షులు మాదాల లక్ష్మీనరసింహం, గుడ్లూరు మండల పార్టీ అధ్యక్షులు జనిగర్ల నాగరాజు నాయకులు పాల్గొన్నారు.



నాయకులతో చర్చిస్తున్న ఎంఎల్ఎ ఇంటూరి నాగేశ్వరరావు

బస్సుల కోసం ఎదురుచూపులు..!

- ◆సమయపాలన పాటించని వైనం
- ◆ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు
- ◆పట్టించుకోని ఆర్‌టిసి అధికారులు

ప్రజాశక్తి- వెంకటాచలం

మండలంలోని వివిధ గ్రామాల నుంచి విద్యార్థులు చదువు రీత్యా మండల కేంద్రమైన వెంకటాచలానికి, నెల్లూరులో ఉన్న కళాశాలలకు, పాఠశాలలకు విద్యార్థులు రాకపోకలు సాగిస్తు న్నారు. ఉద్యోగరీత్యా బస్సులలో ఉద్యోగులు, వివిధ రంగాల కార్మికులు ప్రయాణం చేస్తుంటారు. ఆర్టీసీ బస్సులు మాత్రం సమయానికి రాకపోవడంతో వారంతా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆర్‌టిసి అధికారులు ఈ సమస్యను పరిష్కరిం చలేకపోతున్నారు. వెంకటాచలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలకు విద్యార్థులు ఉదయం 9 గంటలకు రావాల్సి ఉంది. ఆర్‌టిసి బస్సులు రాక సమయానికి ఆలస్యంగా కళాశాలకు విద్యార్థులు వస్తున్నారు. దీంతో విద్యార్థులు తరగతులను చాలావరకు అందుకోలేక నష్టపోతున్నారు. తొలి గంటన్నర తరగతులు అందుకోలేకపోవడంతో వారంతా నష్టపోయే ప్రమాదముంది. గతంలోనూ సమయానికి బస్సులు రాకపోవడంతో విద్యార్థులు కళాశాలకు వెళ్లడం కారణంగా ఆ ప్రభావం వారి చదువుపైడి పరీక్షల్లో చాలామంది విద్యార్థులు ఉత్తీర్ణత కాలేదని ప్రచారం ఉంది. సాయంత్రం తిరిగి ఇళ్లకు చేరుకోవాలంటే సమ యానికి బస్సులు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆర్‌టిసి ఉన్నతాధికారులు స్పందించి సమయానికి బస్సులు ఉండేలా చర్యలు తీసుకోవాలని విద్యార్థులు , వారి తల్లిదండ్రులు కోరుతున్నారు.



విద్యార్థులకు బహుమతులు అందజేత

ప్రజాశక్తి-నెల్లూరు

గిరిజన యోధుడు బిర్సా ముండా పోరాట పటిమను ఆదర్శంగా తీసుకుని విద్యార్థులంతాఉన్నత శిఖరాలను అధిరోహించాలని నెల్లూరు నగర పాలక సంస్థ మేయర్ పొట్లూరి స్రవంతి జయవర్ధన్ పిలుపునిచ్చారు. గిరిపుత్ర ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్థానిక అయ్యప్పగుడి సమీపంలోని గుర్రం బాబయ్య కళ్యాణ మండపంలో వ్యాస రచన పోటీల విజేతలకు ఆదివారం బహుమతులను అందజేశారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన గావించి, బిర్సా ముండా, వెన్నెలకంటి రాఘవయ్య ల చిత్రపటాలకు నివాళులు అర్పించారు. ముఖ్య అతిథులుగా మేయర్ స్రవంతి జయవర్ధన్, ఐ.టి.డి.ఏ స్టేట్ జాయింట్ డైరెక్టర్ యాకసిరి వెంకటేశ్వర్లు, ఉలవపాడు జెడ్పీటీసీ అరుణ, ఎన్.టి.ఎఫ్ జిల్లా అధ్యక్షులు పులి చెంచయ్య లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ గిరిజన యోధుడు బిర్సా ముండా జీవిత చరిత్రపై నగర వ్యాప్తంగా ఉన్న పాఠశాలల్లోని గిరిజన విద్యార్థులకు గతవారం వ్యాసరచన పోటీలను నిర్వహించామని తెలిపారు. 350 మంది పాల్గొని తమలోని ప్రతిభను ప్రదర్శించారని సంతోషం వ్యక్తం చేశారు. ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులను విజేతలను ఎంపిక చేసి బహుమతులు అందజేస్తున్నట్లు తెలిపారు. గిరిపుత్ర ఫౌండేషన్ ద్వారా అందిస్తున్న సేవా కార్యక్రమాలను మరింత విస్తృత పరచాలని మేయర్ స్రవంతి ఆకాంక్షించారు.



బహుమతులు అందుకున్న విద్యార్థులతో మేయర్ పి స్రవంతి జయవర్ధన్

హాసిని హత్య కేసులో 12 మంది నిందితులు అరెస్టు

హిజ్రాల ఆధిపత్య పోరులో భాగమే హత్య - పరారీలో ప్రధాన సూత్రధారులు


ప్రజాశక్తి-నెల్లూరు

హిజ్రా దారుణ హత్యను కేసును పోలీసులు ఛేదించారు. ఇద్దరు హిజ్రా నాయకురాళ్ల మధ్య ఆధిపత్య పోరులో భాగంగానే ఈ హత్య జరిగిందని పోలీసులు భావిస్తున్నారు. ఈ మేరకు హిజ్రా హత్యలో పాల్గొన్న నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. ఆ వివరాలను ఆదివారం ఎస్పి జి కృష్ణకాంత్ ఎస్పి కార్యాలయంలో మీడియాకు వెల్లడించారు.

ఈనెల 26న మానికల హాసిని అనే హిజ్రా(ట్రాన్స్‌జెండర్) హత్యకు గురైంది. విడవలూరు మండలం, పార్లపల్లిలో మహాలక్ష్మి అమ్మవారి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమంలో పాల్గొని తిరిగి నెల్లూరు వైను వస్తున్న హాసినిని రాత్రి 10 గంటల సమయంలో టపాతోపు రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద రెండు కార్లలో వచ్చిన గుర్తు తెలియని వ్యక్తులు అడ్డగించి కత్తులతో దాడి చేసి హాసినిని హత్య చేశారు. దీనిపై కొంత మంది హిజ్రాలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు ఈ కేసు దర్యాప్తు ముమ్మరం చేశారు. అడిషినల్ ఎస్పి సిహెచ్ సౌజన్య , రూరల్ డిఎస్పి జి.శ్రీనివాసరావు పర్యవేక్షణలో కొడవలూరు సిఐ ఎ.సురేంద్ర బాబు ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలు దర్యాప్తు చేపట్టాయి. కోవూరు అండర్ బ్రిడ్జి వద్ద రెండు కార్లలో వెళ్తున్న నిందితులను కొడవలూరు సిఐ నేతృత్వంలోని బృందం అదుపులోకి తీసుకుంది. వారిని విచారించగా అసలు విషయాలు వెలుగు చూశాయి. దక్షిణ కోస్తా-రాయలసీమ, బళ్లారి, రాయచూరు, దర్వాడ్, చిక్ మంగుళూరు, హుబ్లీ జిల్లాల ట్రాన్స్‌జెండర్ వర్గానికి నాయకురాలిగా వ్యవహ రిస్తున్న హాసినికి, పాతనాయకురాలైన అలేఖ్య సులోచన, షిలా అనే హిజ్రాలతో ఉన్న విభేదాల నేపథ్యంలో హాసినిని అడ్డు తొలగించుకోవాలని అలేఖ్య, సులోచన, షీలా భావించారు. వారే ఓ వ్యక్తితో కలిసి పక్కా ప్రణాళికతో హాసినిని హత్య చేసేందుకు నేరచరిత్ర కలిగిన వారితో హత్య చేయించారని పోలీసులు అను మానిస్తున్నారు. హత్యలో పాల్గొన్న 15 మందిలో 12 మందిని పోలీసులు అరెస్టు చేశారు.వారిలో ఇల్లపు వంశికృష్ణ అలియాస్ నాని, మొలతటి రాము, తాండ్ర కార్తీక్, అంబూరు సుబ్రహ్మణ్యం, షేక్ మస్తాన్ వలి అలియాస్ వలి, కొత్తపాటి వెంకటాద్రి, కొత్తపల్లి రాజేష్, గురునాథం నరసింహం, నెల్లూరి వంశి, ఊటుకూరి శీల అలియాస్ శ్రీనివాసులు, రాసపనేని అలేఖ్య అలియాస్ అనీల్‌కుమార్, చింతల భూపతి ఉన్నారు. వీరంతా పాత నేరస్థులు కావడం గమనార్హం. మరో ముగ్గురు ప్రధాన సూత్రధారులైన అలేఖ్య, సులోచన, శీలా ఉన్నారని ఎస్పి జి కృష్ణకాంత్ వెల్లడించారు. సమావేశంలో రూరల్ డిఎస్పి జి శ్రీనివాసరావు, కొడవలూరు సిఐ ఏ.సురేంద్రబాబు, ఎస్ఐ సిహెచ్ కోటిరెడ్డి, విడవలూరు ఎస్ఐ పి.నరేష్ ఉన్నారు. కేసును ఛేదించి నిందితులను పట్టుకున్నవారికి రూరల్ డిఎస్పి జి శ్రీనివాసరావు రివార్డులు ప్రకటించారు.



కేసు వివరాలు వెల్లడిస్తున్న ఎస్పి జి కృష్ణకాంత్, పోలీస్ సిబ్బంది



హాసిని (ఫైల్)

రేషన్ కార్డుల కోసం దరఖాస్తులు

ప్రజాశక్తి గుడ్లూరు రూరల్

నేటి నుంచి 28వ తేదీ వరకూ గ్రామ, వార్డు సచివాలయాల్లో నూతన రేషన్ కార్డులకు దరఖాస్తులు ఇవ్వాలని టిడిపి నాయకులు లబ్ధిదారులకు సూచించారు. కొత్త కార్డులను లబ్ధిదారులకు.. సంక్రాంతి కానుకగా అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని టిడిపి నాయకులు చెబుతున్నారు. ఈ అవకాశాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.



చెట్లతో మూసుకుపోయిన రోడ్డు

రోడ్డు నిర్మాణం చేపట్టాలి..

ప్రజాశక్తి - లింగసముద్రం

రాళ్లపాడు ప్రాజెక్టు ఎడమ కాలువ పారుదల ఉన్న గంగపాలెం కాలువ పొలాల్లోకి వెళ్లేందుకు రోడ్డు నిర్మాణం చేపట్టాలని గంగపాలెం రైతులు, గ్రామస్తులు కోరుతున్నారు.వర్షాలు కురిసే ప్రాజెక్టులోనికి నీరు చేరడంతో ఇటీవల రాళ్లపాడు ఎడమ కాలువకి నీటిని విడుదల చేశారు.దీంతో రైతులు వరి సాగు చేసేందుకు సిద్ధమవుతున్నారు.రైతులు వరి నారుమల్లు సిద్ధం చేసుకుంటున్నారు.గంగపాలెం గ్రామం నుండి పొలాల్లోకి వెళ్లేందుకు రోడ్డు ఉన్నప్పటికీ చెట్లతో నిండిపోయి రాకపోకులకు తీవ్ర అంతరాయం కలుగుతుంది. దీంతో రైతులు వరి సాగు చేసుకునే సమయంలో పోలాల్లోకి వెళ్లేందుకు ఇబ్బందులు ఎదుర్కోవాల్సిన పరిస్థితి వచ్చిందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు వెంటనే స్పందించి గ్రామం నుండి పొలాల్లోకి వెళ్లేందుకు ఉన్న రోడ్డు నిర్మాణాన్ని తక్షణమే చేపట్టి రైతులు ఎదుర్కొంటున్న సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.



మాగుంట సుబ్బరామరెడ్డి చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న దృశ్యం

మాగుంట సుబ్బరామిరెడ్డికి నివాళి

ప్రజాశక్తి-నెల్లూరు

కీర్తిశేషులు ఒంగోలు మాజీ ఎంపి మాగుంట సుబ్బరామిరెడ్డి 29 వ వర్థంతి కార్యక్రమాన్ని నగరంలో నిర్వహించారు. ఎస్-2 సినిమా హాల్లో ఆయన చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఆయన పేదలకు చేసిన సేవలను కొనియాడారు. మాజీ శాసనసభ్యులు సివి శేషారెడ్డి , మాజీ జడ్పీ చైర్మన్ చెంచల బాబు యాదవ్ పత్తి రవీంద్రబాబు రఘురాంముదిరాజ్, విజయ డైరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, ఇందిరా భవన్ కార్యదర్శి బాల సుధాకర్, మాజీ ఎఎంసి చైర్మన్ యేసు నాయుడు, ఓబుల్ రెడ్డిగ,ఉడత నరసింహారావు ల్, పుట్టా విజయ్ కుమార్ రెడ్డి, కట్టా చంద్రశేఖర్ రెడ్డి శ్రీనివాస్ రావు, సురేందర్ రెడ్డి కొండూరు రాంప్రసాద్ రెడ్డి, వరుదిరెడ్డి. రవీందర్ రెడ్డి, ఎల్ల.విజయ భాస్కర్ రెడ్డి కామిరెడ్డి.విజయభాస్కర్ రెడ్డి పోతిరెడ్డి. కమలాకర్ రెడ్డి ఎస్-2 సిబ్బంది పాల్గొన్నారు.



ప్రశంసాపత్రం అందజేస్తున్న దృశ్యం

ప్రశంసాపత్రం అందజేత

ప్రజాశక్తి-నెల్లూరు :ఎయిడ్స్ నివారణ దినోత్సవం సందర్భంగా టౌను హాలులో జరిగిన కార్యక్రమంలో హెచ్ఐవి/ఎయిడ్స్ పట్ల గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని పేద, మధ్యతరగతి ప్రజలకు అవగాహన కల్పిస్తున్న కమ్యూనిటీ పారామెడిక్స్ అండ్ ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్‌కి ప్రశంసా పత్రము మరియు మెమొంటో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ మల్లి పెంచలయ్య, డిఎల్ఓ డాక్టర్ షేక్ ఖాదర్ వల్లి చేతులు మీదుగా జిల్లా అధ్యక్షులు శాఖవరపు వేణుగోపాల్ అందుకున్నారు. ఈ సందర్భంగా శాఖవరపు వేణుగోపాల్ మాట్లాడుతూ 1999వ సంవత్సరం నుంచి పీ.ఎం.పీ, ఆర్.ఎం.పి, గ్రామీణ వైద్యులు గ్రామాలలో ప్రాథమిక వైద్యం చేస్తూ ప్రాణాంతక వ్యాధులు పట్ల అవగాహన కల్పిస్తూ ర్యాలీలు, అవగాహన సదస్సులు నిర్వహిస్తూ ప్రజలను చైతన్యపరుస్తున్నట్లుతెలిపారు. ఆర్ఎంపి అసోసియేషన్ అధ్యక్షులు కోలా రవీంద్రబాబు, పి.హెచ్.పి జిల్లా ప్రధాన కార్యదర్శి గోరంట్ల శేషయ్య, నాయకులు సిహెచ్.వీరయ్య, ఎన్.ప్రసాద్, యు.రామదాసు ఉన్నారు.

వివాహిత అదృశ్యంపై ఫిర్యాదు

ప్రజాశక్తి -గుడ్లూరు :వివాహిత అదృశ్యమైన సంఘటనపై పోలీసులకు ఫిర్యాదు అందింది. ఈమేరకు ఆ వివరాలను ఎస్ఐ వెంకట్రావు ఆదివారం వెల్లడించారు. మండలంలోని నరసాపురానికి చెందిన బి లక్ష్మీదేవి శింగరాయకొండ దగ్గర ఉన్న మలినేని లక్ష్మయ్య బి ఫార్మసీ కాలేజీలో చివరి సంవత్సరం చదువుతోంది. నరసాపురానికి చెందిన శ్రీ శ్రీనివాసులు అనే యువకుడితో నవంబర్ 25న వివాహం జరిగింది. అదే నెల 28న వివాహం జరిగింది. అనంతరం బి ఫార్మసీ పూర్తి చేయాల్సి ఉందని, అందుకోసం కళాశాలకు వెళ్లాలని శనివారం భర్తకు చెప్పి వెళ్లింది. తిరిగి సాయంత్రానికి ఇంటికి రాకపోవడంతో లక్ష్మీదేవికి సమాచారం కోసం ఫోన్ చేశారు ఫోన్ చేయగా స్విచ్ ఆఫ్ రావడంతో కంగారుపడి ఆ యువతి కోసం వెతుకులాట ప్రారంభించారు. ఆచూకి తెలియకపోవడంతో గుడ్లూరు పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు లక్ష్మీదేవి మామ తిరుపాలు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

హెచ్ఐవి నివారణపై అవగాహన

ప్రజాశక్తి-నెల్లూరు

హెచ్ఐవి పట్ల ప్రజల్లో కొంత మేరకు అవగాహన ఉందని, మరిన్ని కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా హెచ్ఐవి రహిత సమాజాన్ని భావితరాలకు అందజేయవచ్చని డిఎంఅండ్‌హెచ్ఓ డాక్టరు ఎం.పెంచలయ్య పిలుపు నిచ్చారు. ఆదివారం ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవాన్ని పురస్కరించుకోని జిల్లా లెప్రసి, ఎయిడ్స్ అండ్ టిబి అధికారి డాక్టరు ఎస్‌కె ఖాదర్‌వ నేతృత్వంలో జిల్లా ఎయిడ్స్ నియంత్రణ విభాగం పలు కార్యక్రమాలు నిర్వహించింది. ముందుగా నగరంలో గాంధీబొమ్మ సెంటర్ నుంచి టౌన్‌హాల్ వరకు వైద్య ఆరోగ్య సిబ్బంది, స్వచ్ఛంద సంస్థలు పిఎంపి, ఆర్ఎంపి, ప్రజా సంఘాల సంయుక్తంగా భారీ ర్యాలీ నిర్వహించాయి. అనంతరం టౌన్‌హాలులో సభ నిర్వహించారు. ముఖ్యఅతిధిగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టరు ఎం.పెంచలయ్య హాజరయ్యారు. జిల్లా లెప్రసి, ఎయిడ్స్, టిబి అధికారి డాక్టరు ఎస్‌కె ఖాదర్‌వలి మాట్లాడుతూ జిల్లాలో హెచ్ఐవి గణణీయంగా తగ్గుముఖం పట్టిందన్నారు. బాధితులకు జిల్లా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలల్లో, అర్బన్ హెల్త్ సెంటర్లలో, ఐసిటిసి కేంద్రా ఉచితంగా పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పరీక్షలు చేయించుకున్న వారికి సంబంధించిన సమాచారాన్ని గోప్యంగా ఉంచడంతోపాటు హెచ్ఐవి నిర్ధారణ అయిన వారికి మందులు ఉచితంగా అందజేస్తున్నట్లు తెలిపారు. హెచ్ఐవి వ్యాధిగ్రస్తులపట్ల వివక్ష చూపొద్దన్నారు. పలువురు వక్తలు హెచ్ఐవి నివారణపై అవగాహన కల్పించారు. చివరగా ఉత్తమ సేవలందిస్తున్న పలువురికి జ్ఞాపికలు, ప్రశంసా పత్రాలను అందజేశారు. ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవాన్ని పురస్కరించుకోని నిర్వహిచిన పోటీ పరీక్షల్లో ప్రతిభను కనపరిచిన వారికి బహుమతులు అందజేశారు. డిసిహెచ్ఎస్ డాక్టరు రమేష్ నాయక్, జిజిహెచ్ గైనకాలజీ విభాగం హెచ్ఒడి డాక్టరు గీతాలక్ష్మి, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ విభాగం సిబ్బంది, ఎన్ఎన్‌పి ప్లస్, ఆర్ఎంపి, పిఎంపి అసోసియేషన్, స్వచ్ఛంద సంస్థలు , ఎన్‌సిసి, ఎన్ఎస్ఎస్ విభాగాల సభ్యులు పాల్గొన్నారు.



ర్యాలీని ప్రారంభిస్తున్న డిఎంహెచ్ఓ

ప్రజాశక్తి-వెంకటాచలం

ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవ కార్యక్రమం సందర్భంగా విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం ఎన్.ఎస్.ఎస్ యూనిట్ -4 విద్యార్థులు నెల్లూరులోని విఆర్‌సి సెంటర్‌ల్లో అవగాహన ర్యాలీ చేపట్టారు. ఈ కార్యక్రమాన్ని ఎన్.ఎస్.ఎస్ యూనిట్ 4 ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ బి వెంకట సుబ్బారెడ్డి పర్యవేక్షించారు.అనంతరం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో టౌన్ హాల్లో నిర్వహించిన సమావేశానికి హాజరయ్యారు. సామాజిక చైతన్యాన్ని, స్ఫూర్తిని నింపేటువంటి కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్న ఎన్.ఎస్.ఎస్ వాలంటీర్లను విఎస్‌యు ఉపకులపతి ఆచార్య ఎస్ విజయభాస్కరరావు ప్రత్యేక అభినందనలు తెలిపారు.



విఎస్‌యు ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో..

కందుకూరులో పందులు స్వైరవిహారం..

మెరుగుపడని పారిశుధ్యం

ప్రజాశక్తి-కందుకూరు

కందుకూరు పట్టణంలో పందుల సైర్య విహారం కనిపిస్తుంది. గత కొన్నేళ్లుగా పందుల సంచారం పట్టణంలో పెద్దగా కనిపించకుండా పోయింది. గతంలో కందుకూరు పట్టణంలో పందుల పెంపకం పెద్ద ఎత్తున సాగుతూ ఉండేది. పట్టణంలోని పేటలో ముఖ్యంగా మురికివాడల్లో పందుల సంచారం ఎక్కువగా కనిపిస్తూ ఉండేది. పందుల సంచారం వల్ల చిన్న పిల్లలకు మెదడు వాపు వ్యాధి సోకుతుందనే కారణంతో వాటిని లేకుండా చేయడానికి ప్రయత్నాలు జరిగాయి. పందుల పెంపకం దారులకు కందుకూరు మున్సిపాలిటీ అధికారులు హెచ్చరికలు జారీ చేసి ఊరి బయట పెంపకాలు సాగించాలని హుకుం జారీ చేశారు. ఆ ఆదేశాలను బేఖాతర్ చేసిన సందర్భలలో మున్సిపాలిటీ పందులను పట్టుకుని వేలం వేయడం ప్రారంభించింది.దీంతో పందుల పెంపకం దాదాపు కనిపించకుండా పోయింది. ఇప్పుడు పట్టణంలో పందుల సంచారానికి అనువైన వాతావరణం మొదలు కావడంతో వాటి సంచారం పెరిగింది. పట్టణంలో పారిశుధ్య పరిస్థితి దిగజారి పోవడంతో పందులకు పారిశుధ్య పేరుకుపోయిన ప్రాంతాలు ఆవాసాలుగా మారాయి. మున్సిపల్ అధికారులు పట్టణ ప్రధాన కూడళ్లలో పారిశుధ్య పరిస్థితులను చక్కబెట్టడానికి ప్రయత్నిస్తున్నారు. మారుమూల పేటలో పారిశుధ్య పరిస్థితి అధ్వానంగానే కనిపిస్తుంది. రోడ్ల వెంట చెత్త కుప్పలు దర్శనం ఇస్తున్నాయి. పట్టణం నడిబొడ్డున ఉన్న జనార్ధన స్వామి గుడి ప్రాంతంలో పారిశుద్ధ్య పరిస్థితి మరింత అధ్వానంగా తయారయింది. చెత్తను తొలగించకపోవడంతో పందులు ఆ చెత్తకుప్పలపై కాపరాలు చేస్తున్నాయి.పారిశుధ్య పరిస్థితిని ఎప్పటికప్పుడు పరివేక్షించడానికి సచివాలయ సెక్రెటరీల తోపాటు మున్సిపల్ అధికారులు ,మున్సిపాలిటీ నియమించిన మేస్త్రీలతో పాటు మున్సిపల్ కమిషనర్ కూడా నిత్యం పనిచేస్తున్నట్లు కనిపిస్తున్నారు. అయితే వారి పని మొత్తం ప్రధానమైన బజార్లు ,వీధులకే పరిమితం కావడంతో పట్టణ శివారు ప్రాంతాల్లో పారిశుధ్యం అధ్వానంగా మారి ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. కందుకూరు పట్టణంలో డెంగ్యూ వ్యాధి భారీ ఎత్తున సోకుతుంది. కొంతమంది ప్రాణాలు కూడా ఇటీవల పోయాయి అంటే పరిస్థితి ఎలావుందో అర్థం చేసుకోవచ్చంటున్నారు.



చెత్తకుప్పలపై పందులు స్వైర విహారం చేస్తున్న దృశ్యం



జనార్ధన స్వామి గుడి వద్ద పేరుకుపోయిన చెత్త

గాంధీ గిరిజన కాలనీలో
సిపిఎం బృందం పర్యటన

ప్రజాశక్తి-నెల్లూరు

ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా నగర నియోజకవర్గం, 53వ డివిజన్ పరిధిలోని గాంధీగిరిజన కాలనీలో పలు ఇళ్లు నీటిమునిగాయి. ఈ నేపథ్యంలో బాధిత కుటుంభాలను అధికారులు ఆదుకోవాలని సిపిఎం నగర కమిటీ డిమాండ్‌చేసింది. ఈ మేరకు ఆదివారం ఈ ప్రాంతంలో సిపిఎం నగర కార్యదర్శి కత్తి శ్రీనివాసులు నాయకత్వంలో సిపిఎం బృందం పర్యటించి బాధితులను పరామర్శించింది. సిపిఎం నగర కార్యదర్శి కత్తి శ్రీనివాసులు మాట్లాడుతూ గాంధీ గిరిజన కాలనీ శివారు ప్రాంతమన్నారు. ఉన్న బుడబుక్కల వారు నివసించే ఆ ప్రాంతంలో ప్రతి సంవత్సరం కొద్దిపాటి వర్షానికే ఇళ్లలోకి నీరు చేరుతుందన్నారు. పేదలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. నగర కమిషనర్ స్పందించి మోటర్లు పెట్టి బయటకు తరలించాలని కోరారు. శాశ్వత పరిష్కారంగా సైడ్ కాలువలు నిర్మించి, అవుట్ లెట్లు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. సిపిఎం నగర కమిటీ సభ్యులు బీపీ నరసింహ, స్థానిక నాయకులు ఏకుల సిద్దార్థ, పెంచలయ్య పాల్గొన్నారు.



పరిశీలిస్తున్న సిపిఎం నాయకులు

తల్లిదండ్రులు విధిగా పాల్గొనాలి : డిఇఒ

నెల్లూరు :జిల్లాలో 2061 పాఠశాలల్లో మెగా పేరెంట్, టీచర్ మీటింగ్ కార్యక్రమాన్ని పండగ వాతావరణంలో నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేపట్టినట్లు జిల్లా విద్యాశాఖ అధికారి డాక్టర్ బాలాజీ రావు ఒక ప్రకటనలో చెప్పారు. విద్యార్థుల బంగారు భవిష్యత్తు కోసం బడివైపు ఒక అడుగు పేరుతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఈనెల 7న అన్ని పాఠశాలల్లో ఃఎరెంట్ టీచర్ మీటింగ్ కార్యక్రమాన్ని భారీ స్థాయిలో నిర్వహించేందుకు ఆదేశాలు జారీ చేసిందని, ఆ మేరకు పాఠశాలల్లో ఏర్పాట్లు చేపట్టినట్లు చెప్పారు. విద్యార్థులు, తల్లిదండ్రులు, పాఠశాలల మధ్య అనుబంధాన్ని ఏర్పరచడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యమన్నారు.

కూటమి ప్రభుత్వంలో ప్రజలపై భారాలు

వైసిపి కందుకూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి 'బుర్రా' విమర్శ

ప్రజాశక్తి-కందుకూరు

కూటమి ప్రభుత్వం విఫల ప్రభుత్వం అని కందుకూరు వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి బుర్రా మదుసూదన్ యాదవ్ విమర్శించారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలో ప్రజలపై విద్యుత్ ఛార్జీల భారం మోపిన ఘనత చంద్రబాబుకే దక్కుతుందని ఎద్దేవా చేశారు. ఎన్నికలకు ముందు చార్జీలు పెంచనని ప్రజలకు వాగ్దానం చేసి అధికారంలోకి వచ్చాక ఆ హామీని తుంగలోకి తొక్కిన చంద్రబాబు ఆరు నెలల్లో వరుసగా రెండుసార్లు ట్రూప్ ఆప్ చార్జీల పేరిట భారాలు మోపారని తెలిపారు. రోండోసారి 9412 కోట్లు కరెంటు చార్జీల పెంచి ప్రజల పైన ఈ ఆరు నెలల్లోనే 15,485.36 కోట్ల భారం మోపారని తెలిపారు. కూటమి ప్రభుత్వం ఒక విఫల ప్రభుత్వం ఆయన విమర్శించారు. సూపర్ సిక్స్ హామీలతో అధికారంలోకి వచ్చిన చంద్రబాబు మరోసారి తన మార్కు నయవంచనతో తాను ఇచ్చిన హామీలను తూట్లు పొడుస్తూ మరోసారి ప్రజలు నడ్డి విరిచారన్నారు. వెంటనే ప్రజలపై భారాలు తగ్గించాలన్నారు.



బుర్రా మధుసూదన్ యాదవ్

రెడ్‌క్రాస్‌లో 'మాగుంట' వర్ధంతి



ప్రజాశక్తి-కావలి : ఒంగోలు మాజీ పార్లమెంటు సభ్యులు మాగుంట సుబ్బరామిరెడ్డి 29వ వర్ధంతి సందర్భంగా ఆదివారం కావలి రెడ్‌క్రాస్ భవనంలో సుబ్బరామిరెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళ అర్పించారు. అనంతరం లైఫ్‌లైన్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు తాటికొండ నవీన్ మాగుంట సుబ్బరామిరెడ్డి వర్ధంతి సందర్భంగా 52వ సారి రక్తదానం చేశారు. ఈ సందర్భంగా కావలి రెడ్‌క్రాస్ చైర్మన్ రవిప్రకాష్ మాట్లాడుతూ మాగుంట సుబ్బరామిరెడ్డి కావలి ప్రజల దాహార్తిని తీర్చిన మంచినీటి ప్రదాత, మాగుంట ఛారిటబుల్ ట్రస్ట్ ద్వారా అనేక సేవా కార్యక్రమాలు చేసి ప్రజా సేవకుడిగా ఆదాభిమానాలు పొంది ప్రజల హృదయాలలో చిరస్థాయిగా నిలిచారని తెలిపారు. మాగుంట సుబ్బరామిరెడ్డి వర్ధంతి సందర్భంగా తాటికొండ నవీన్ 52వ సారి రక్తదానం చెయ్యడం అభినందనీయమన్నారు. తాటికొండ నవీన్ మాట్లాడుతూ ఒంగోలు మాజీ పార్లమెంటు సభ్యులు మాగుంట సుబ్బరామిరెడ్డి స్నేహశీలి, విద్యాదాత, మంచినీటి దాత, అపర దానకర్ణుడు, సేవాతత్పరుడు, ప్రకాశం నెల్లూరు ప్రజల హృదయాలలో చిరస్థాయిగా నిలిచిపోయిన నిస్వార్థ ప్రజా సేవకులు అని కొనియాడారు. ఇప్పటి వరకు 52 సార్లు రక్తదానం చేసినందుకు గాను కావలి రెడ్‌క్రాస్ వారు నవీన్‌ను దుశ్శాలువాతో సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో పాలకొండయ్య, టీమ్ సేవియర్స్ ప్రతీప్, రెడ్‌క్రాస్ మేనేజర్ ప్రసాద్, టీమ్ సేవియర్స్ సభ్యులు, రెడ్‌క్రాస్ సిబ్బంది పాల్గొన్నారు.

'మాగుంట'కు చెంచలబాబు నివాళులు



ప్రజాశక్తి-ఉదయగిరి : ఒంగోలు మాజీ పార్లమెంట్ సభ్యులు మాగుంట సుబ్బరామిరెడ్డి 29వ వర్ధంతిలో టిడిపి రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రెటరీ జెడిపి మాజీ చైర్మన్ పి.చెంచలబాబు యాదవ్ పుష్పాంజలి ఘటించి ఘన నివాళులర్పించారు. ఆదివారం నెల్లూరు పట్టణంలోని ఎస్-2 సినిమా హాల్లో జరిగిన వర్ధంతి కార్యక్రమంలో ఆయన పాల్గొని సుబ్బరామిరెడ్డి చిత్రపటానికి ఘనంగా నివాళులర్పించి ఈ సందర్భంగా మాట్లాడారు. సుబ్బరామిరెడ్డి మెట్టప్రాంత ప్రజల అభ్యున్నతికి ఆనీ ఒంగోలు పార్లమెంటులోని ఏడు నియోజకవర్గాల్లో సాగు, తాగునీరు, విద్య వైద్య వసతులు కల్పించిన గొప్ప నాయకులని నేటికీ మెట్ట ప్రాంత ప్రజల హృదయాలలో చెరగని ముద్ర వేసుకున్న గొప్ప నాయకులని కొనియాడారు. ఆయన ఆశయాలను నెరవేరుస్తున్న ఒంగోలు పార్లమెంట్ సభ్యులు మాగుంట శ్రీనివాస్ రెడ్డి ప్రజలతో మమేకమై ప్రజానాయకుడిగా పేరుగాంచారని తెలియజేస్తూ సుబ్బరామిరెడ్డికి ఆయనకు ఘనంగా నివాళులర్పించారు.

డాక్టర్ గీతకు ప్రశంసాపత్రం



ప్రజాశక్తి-కలిగిరి : ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని హెచ్ఐవి నివారణ పరీక్షలు అవగాహన కల్పించినందుకు గాను ఆదివారం కలిగిరి వైద్యాధికారిణి బిజ్జం గీతకు జిల్లా వైద్య అధికారులు ప్రశంసాపత్రం, మెమెంటోను అందజేశారు. హెచ్ఐవి ఉన్నవారికి ఎఆర్‌టి మందులు సకాలంలో అందించడం, ప్రతి హెచ్ఐవి పేషెంట్‌కు టిబి, గర్భ నిర్ధారణ పరీక్షలు చేయించడం తోపాటు పాటు వ్యాధి గ్రస్తులకు సంవత్సరం పాటు రూ.30వేల మందులను ఉచితంగా అందించి నందుకు గాను వైద్య అధికారులు గుర్తించి ప్రశంసా పత్రాన్ని అందజేశారు.

సింహాద్రిరావుకు ఉత్తమ సేవా అవార్డు



ప్రజాశక్తి-బిట్రగుంట : ప్రపంచ ఎయిడ్స్ దినం సందర్భంగా నెల్లూరు టౌన్ హాలులో రాష్ట్ర ప్రభుత్వ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ఆదివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బోగోలు మండలంలో భవాని ఎడ్యుకేషనల్ సొసైటీ ఆదరణ కేంద్రం డైరెక్టర్ డాక్టర్ కట్టెపల్లి సింహాద్రి రావుకు ఉత్తమ సేవా అవార్డు ప్రదానం చేశారు. 3 దశాబ్దాల కాలంగా ఎయిడ్స్ వ్యాధి బారిన పడిన వారికి సేవలు అందిస్తున్నందుకు గుర్తించిన ప్రభుత్వం ఉత్తమ సేవా పురస్కారం అందజేసింది. జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ ఎం.పెంచలయ్య అందజేశారు. కార్యక్రమంలో జిల్లా ఎయిడ్స్ నోడల్ అధికారి డాక్టర్ ఖాదర్ వలీ, నెహ్రూ యువకేంద్రం కోఆర్డినేటర్ మహేంద్ర రెడ్డి, సెట్నెల్ సిఇఒ శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

ఎయిడ్స్ నివారణపై అవగాహన



ప్రజాశక్తి-కావలి : జవహర్ భారతి డిగ్రీ కళాశాలలో ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా ఆదివారం విద్యార్థులకు ఎయిడ్స్‌పై అవగాహన, ఆవశ్యకతపై పోస్టర్ మేకింగ్ పోటీలను నిర్వహించారు. ఈ పోటీలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తమ నైపుణ్యాలను ప్రదర్శించారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన టీమ్‌కు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పి.సుబ్రహ్మణ్యం నాయుడు, స్వయం ఉపాధి కోర్సుల డైరెక్టర్ డాక్టర్ ఆర్.మాల్యాద్రి అందించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ మాట్లాడుతూ "ఎయిడ్స్ అంటువ్యాధి కాదని, అంటించుకునే వ్యాధి" అని అన్నారు. ఎయిడ్స్‌కు చికిత్స లేదని నివారణ ఒక్కటే మార్గమని తెలియజేశారు. ఎన్.ఎస్.సి. డైరెక్టర్ ప్రసంగిస్తూ ఎయిడ్స్ కేంద్రాలను సందర్శించి అక్కడున్న రోగులకు మానవత్వంతో చేయూత సేవా సహకారాలు అందించాలని కోరారు. రెడ్ రిబ్బన్ క్లబ్ కోఆర్డినేటర్ వి.వసుంధరాదేవి మాట్లాడుతూ ఎయిడ్స్ రోగులపై దయ, కరుణ కలిగి ఉండాలని, వారిని ద్వేషించ రాదని హితవు పలికారు. ఆదివిధంగా కళాశాల విద్యార్థులు అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది మానవహారంగా ఏర్పడి, ఎయిడ్స్ అవగాహన నినాదాలు ఇచ్చారు. విద్యార్థులు ఈ కార్యక్రమ నిర్వహించినందుకు విశ్వోదయ రెక్టార్ డి.విజయకుమార్ రెడ్డి, కళాశాల కరస్పాండెంట్ వి.సుధాకర్ రెడ్డి అభినందించారు. కార్యక్రమంలో రెడ్ రిబ్బన్ క్లబ్ మెంబర్స్, ఎన్.ఎస్.ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్స్ పాల్గొని జయప్రదం చేశారు.

అభినందన సభ ఏర్పాట్లు పరిశీలన



ప్రజాశక్తి-వింజమూరు : వింజమూరులోని ఎస్‌విఎస్ కళ్యాణమండపం వద్ద ఉదయగిరి నియోజకవర్గ స్థాయిలో 3వ తేదీ జరగనున్న టిడిపి అభినందన సభ ఏర్పాట్లను జిల్లా టిడిపి కార్యనిర్వాహక కార్యదర్శి పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ 3వ తేదీ జరగబోవు టిడిపి అభినందన సభకు నియోజకవర్గ స్థాయిలోని అన్ని మండలాల నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు హాజరవుతున్నారని, జిల్లా పార్లమెంటు సభ్యులు శాసనసభ్యులు ఇన్ఛార్జి మంత్రులు నామినేటెడ్ పదవుల చైర్మన్లు, ప్రజా ప్రతినిధులు అందరూ భారీ సంఖ్యలో హాజరవుతున్నారు. ఈ సభను ఘనంగా జయప్రదం చేసే దిశగా వచ్చిన కార్యకర్తలకు ఇలాంటి అసౌకర్యం కలుగకుండా తగిన చర్యలు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఈ అభినందన సభ కార్యక్రమం ఉదయగిరి ఎంఎల్ఎ కాకర్ల సురేష్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నామని తెలియజేశారు. కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షులు కె.నాగిరెడ్డి, బిసిసెల్ మెంబర్ ఎం.తిరుపతయ్య, బి.పెంచల రెడ్డి, డి శీను, వి సుబ్బారెడ్డి, తేజ పాల్గొన్నారు.

సురేంద్ర మృతి టిడిపికి లోటు



ప్రజాశక్తి-కలిగిరి : రాష్ట్ర రైతు సంఘం కార్యనిర్వాహక అధ్యక్షులు బొల్లినేని వెంకట రామారావు కుమారుడు సురేంద్ర అకాల మరణం టిడిపికి తీరని లోటు అని మండల అధ్యక్షులు బి.వెంకటప్పిరెడ్డి, కార్యదర్శి కాకు మహేష్ ఆదివారం తెలిపారు. హిందూపురం ఎంఎల్ఎ నందమూరి బాలకృష్ణ సినీ పిఆర్‌ఓగా, ఉదయగిరి నియోజకవర్గ సోషల్ మీడియా సైనికుడు చెన్నైలో అకాల మరణం చెందడం పార్టీకి తీరని లోటని వారన్నారు. కలిగిరి మండలంలోని పెదపాడు గ్రామానికి చెందిన మాజీ ఎంపిపి బొల్లినేని వెంకటేశ్వర రావు నివాళులు అర్పించారు.

పేకాటరాయుళ్లు అరెస్టు

- రూ.26వేల నగదు స్వాధీనం



ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్ : ఆత్మకూరు మున్సిపల్ పరిధిలోని వెంకట్రావుపల్లి ఎస్‌టి కాలనీ సమీపంలో పేకాట ఆడుతున్నారనే సమాచారంతో సిఐ గంగాధర్ ఆధ్వర్యంలో పోలీసులు ఆదివారం దాడులు నిర్వహించి ఏడుగురు వ్యక్తులను, రూ.26,750ల నగదును స్వాధీనం చేసుకున్నారు. సిఐ గంగాధర్ తెలిపిన వివరాల మేరకు.. తమకు అందిన సమాచారం మేరకు ఆదివారం సాయంత్రం 5 గంటలకు వెంకట్రావుపల్లి ఎస్‌టి కాలనీ సమీపంలో పేకాట స్థావరంపై దాడులు నిర్వహించామన్నారు. ఏడుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారివద్ద నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు. కార్యక్రమంలో ఎస్ఐలు జిలాని, సాయిప్రసాద్, సిబ్బంది ఉన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన అవసరం

- ఎస్‌పి జి.కృష్ణకాంత్



ప్రజాశక్తి-నెల్లూరు

సైబర్ నేరాలపై ప్రజలందరూ అవగాహన కలిగి ఉండాలని ఎస్‌పి కృష్ణకాంత్ పేర్కొన్నారు. సైబర్ నేరగాళ్లు ప్రజల అమాయకత్వాన్ని ఆసరాగా తీసుకోని నిత్యం సరికొత్త పద్ధతుల్లో మోసాలకు పాల్పడుతున్న ఘటనలు అధికమైపోతున్నాయి. అటువంటి కేటుగాళ్లు విసిరే వలకు చిక్కకుండా తప్పించుకొనేందుకు పోలీసులు ప్రజలకు చైతన్య పరిచే కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అంత జాగ్రత్తగా ఉన్నా మోసానికి గురైన వారు తక్షణమే స్పందించి 1930 నెంబరుకు కాల్ చేసి సమాచారం అందజేయాలని ఆయన మాటల్లోనే..

ప్రశ్న. సైబర్ నేరాలు అధికమైపోతున్నాయి. సైబర్ నేరస్తులు విసిరిన వలలో చిక్కుకున్న అనేకమంది తమ ప్రాణాలను సైతం కోల్పోతున్నారు. సైబర్ నేరగాళ్ల నుంచి ప్రజలు తప్పించుకొనేందుకు పోలీసులు ఎటువంటి చర్యలు తీసుకుంటున్నారు..?

జవాబు. రాష్ట్ర ప్రభుత్వం ప్రస్తుత సరికొత్తగా గంజాయి, డ్రగ్స్, సైబర్ క్రైం కట్టడికి రాష్ట్ర ప్రభుత్వం ఎలైట్ యాంటీ-నార్కోటిక్స్ గ్రూపు పర్ లా ఎన్‌ఫోర్స్‌మెంట్ (ఈగల్) అనే ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేసింది. సమాజంలో ఎక్కడపడితే అక్కడ గంజాయి లభించడం వల్ల యువత దానికి బానిసలై తమ బంగారు జీవితాలను నాశనం చేసుకుం టున్నారు. గంజాయి సేవనం వల్ల కలిగే అనర్థాలను, దుష్ఫలితాల పై యువతకు అవగాహన కల్పించే కార్యక్రమం జిల్లా పోలీసు శాఖ చేపట్టింది. అందులో భాగంగా జిల్లా వ్యాప్తంగా 48 కళాశాలల్లో విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాం. ఇమేజస్ తయారు చేసి ప్రజల్లో అవగాహన కల్పించే కార్యక్రమాలకు శ్రీకారం చుట్టాం. ప్రజలకు ఎవరైన అపరిచిత వ్యక్తులు ఫోన్ చేసి బ్యాంకు ఖాతా నెంబరు, ఎటిఎం కార్డు నెంబరు, పిన్ నెంబరు, ఆధార్ కార్డుకు సంబంధించిన సమాచారం, ఆధార్ నెంబరు, పాన్‌కార్డుకు సంబంధించిన వివరాలు అడిగితే ఎటువంటి పరిస్థితుల్లో తెలియజేయరాదు. ఏ మాత్రం అనుమానం వచ్చిన వెంటనే టోల్ ఫ్రీ నెంబరు 1930కు ఫోన్ చేసి తమకు ఏ ఫోన్ నెంబర్ నుంచి కాల్ వచ్చింది, ఎటువంటి సమాచారం కావాలని అడిగారో తెలియజేయాలన్నారు. ఉమేష్ చంద్రా కాన్ఫరెన్స్ హాల్‌లో ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించే సమయంలో సుమారు 400 మందికి ఈ సైబర్ క్రైం బారిన పడకుండా ఉండేందుకు చైతన్య పరిచే విధంగా అవగాహన కల్పించే కార్యక్రమం (వీడియోలు, ఆడియోలు, చిత్రాలు) ఉమేష్ చంద్రా కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నాం.

ప్రశ్న. ఇటీవల కాలంలో 'ఫేక్ లోన్ యాప్స్' కారణంగా అనేక మంది, ముఖ్యంగా యువత ఆర్థిక ఇబ్బందులకు గురై తమ జీవితాలను ఛిన్నాభిన్నం చేసుకుంటున్నారు. వారికి మీరు ఇచ్చే సలహాలు, సూచనలు ఏమిటీ..?

జవాబు. లోన్ యాప్స్ ఎక్కువగా ఆర్.బి.ఐ.తో ధృవీకరించబడినవి కావు. పొరపాటున లోన్ యాప్స్ ఫోన్‌లో ఇన్‌స్టాల్ చేసుకున్న వెంటనే ఫోన్‌లో ఉన్న కాంటాక్ట్స్‌కు సంబంధించిన సమాచారం, ఫొటోలు డౌన్‌లోడ్ చేసుకుంటారు. ఫోన్‌లో ఉన్న ఆధార్ కార్డు, బ్యాంకు ఖాతా వివరాలు పూర్తిగా తెలుసుకుంటారు. లోన్ ఆఫర్‌ను నిరాకరించినప్పటికీ బ్యాంకు ఖాతకు నగదు క్రెడిట్ చేస్తారు. అప్పటి నుంచి అధిక వడ్డీ వసూలు చేస్తారు. లోన్ మొత్తం చెల్లించినా రకరకాల ఛార్జీల పేరుతో వేదింపులకు పాల్పడతారు. వారు చెప్పిన సమయానికి నగదు చెల్లించకపోతే మీ ఫోన్ నుంచి సేకరించిన ఫొటోలను అసభ్యకరంగా చిత్రీకరించి స్నేహితులకు, బంధువులకు పంపిస్తామంటూ భయాందోళనలకు గురిచేస్తారు. ఇటువంటి ఘటనలు ఎదరైతే వెంటనే సమీపంలోని పోలీసు స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేయాలి. 1930 ఫోన్ నెంబర్‌కు సమాచారం ఇవ్వాలి.

ఇంటర్వ్యూ

ప్రశ్న. నగరంలో ట్రాఫిక్ సమస్య అధికంగా ఉంది. ఈ సమస్యను అధిగమించేందుకు ఎటువంటి చర్యలు తీసుకుంటున్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ఎటువంటి చర్యలు తీసుకుంటున్నారు..?

జవాబు. రోడ్డు ప్రమాదాల నివారణకు పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నాం. నగరంలో ఇంటిగ్రేటెడ్ ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ పరిధిలో ప్రధాన కూడళ్లయిన 7 చోట్ల ట్రాఫిక్ సిగ్నెల్ ఏర్పాటుకు రంగం సిద్ధం చేశాం. ఈ వ్యవస్థకు నగర డిఎస్‌పి ఇన్‌ఛార్జి గా వ్యవహరిస్తున్నారు. నగర పరిధిలోని పోలీసు సిబ్బంది సహకారంతో ట్రాఫిక్ క్రమ బద్ధీకరణ చేసేందుకు చర్యలు తీసుకున్నాం.

ప్రశ్న. గతంలో రౌడీషీటర్లుగా గుర్తించబడిన వారు జిల్లాలో లా అండ్ ఆర్డర్‌కి విఘాతం కల్పించకుండా నివారించేందుకు పోలీసు శాఖ నిఘా ఏ మేరకు ఉంది. రౌడీ షీటర్లుగా ఉన్న వారు, గతంలో హత్య కేసుల్లో నిందితులుగా ఉన్న వారు తిరిగి మళ్లీ పలు హత్య కేసుల్లో నిందితులుగా పోలీసులు అరెస్టు చేస్తున్నారు. గతంలో పిడి యాక్టు ప్రయోగించే వారు, ప్రస్తుతం పోలీసు శాఖ వీరిపై ఎటువంటి నిఘా ఉంచుతుంది..?

జవాబు. జిల్లాలో ప్రశాంత వాతావరణానికి భంగం కలిగించే విధంగా ఎవరు వ్యవహరించినా, లా అండ్ ఆర్డర్‌కు విఘాతం కల్పించిన వారు ఎంతటి వారైనా ఉపేక్షించే ప్రసక్తే లేదు. పోలీసు స్టేషన్ పరిధిలో రౌడీషీట్ ఓపెన్ చేసిన వారి కదలికలపై పోలీసులు కన్నేసి ఉండాలని, అంతే కాకుండా పలు హత్య కేసుల్లో నిందితులుగా పేర్కొన్న వారి వ్యవహర శైలిపై పోలీసు నిఘా ఉంటుంది. రౌడీషీటర్లు, గతంలో నేరాలకు పాల్పడిన వారు ఎవరైన ఇటువంటి చర్యలకు పాల్పడినట్లు తెలిసినా, తన దృష్టికి వచ్చినా సంబంధిత పోలీసు సేషన్ ఆఫీసర్‌కు మెమోలు అందజేస్తాం. పోలీసు స్టేషన్ పరిధిలో నేరచరిత్ర కలిగిన వారి కదలికలు, రౌడీ షీటర్ల కదలికలను పోలీసులు కనిపెట్టే ఉంటారు.

ప్రశ్న. పోలీసు స్టేషన్ల పరిధిలో రౌడీ షీటర్లకు కౌన్సిలింగ్ గతంలో క్రమం తప్పకుండా నిర్వహించే వారు, ప్రస్తుతం కౌన్సిలింగ్ కార్యక్రమాలు కుంటుబడ్డాయన్న ఆరోపణలు వస్తున్నాయి. దానిపై మీ స్పందన ఏమిటి..?

జవాబు. జిల్లాలోని ప్రతి పోలీసు స్టేషన్‌లో రౌడీ షీటర్లకు కౌన్సిలింగ్ ఇస్తున్నాం. హైకోర్టు నియమనిబంధనల మేరకు ఈ కౌన్సిలింగ్ నిర్వహిస్తున్నాం.



వైద్యం చేస్తున్న డాక్టర్ ఎమ్ వి రమణయ్య

పేదలకు తక్కువ ధరకే వైద్యం

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్

పేదవారికి చౌకగా వైద్యం అందించడమే లక్ష్యంగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నామని డాక్టర్ రామచంద్రారెడ్డి హాస్పిటల్ వైద్య నిపుణులు డాక్టర్ ఎమ్ వి రమణయ్య పేర్కొన్నారు. ఆత్మకూరు పట్టణంలోని జన విజ్ఞాన వేదిక ఆత్మకూరు మండల శాఖ డాక్టర్ జెట్టి శేషారెడ్డి జన విజ్ఞాన వేదిక వారి సహకారంతో ప్రతి రెండు నెలలకు ఒకసారి నిర్వహించే వైద్య శిబిరంలో ఆదివారం సుగర్, బిపి పేషెంట్లకు వైద్యం పట్టణంలోని శ్రీ షిరిడి సాయిరాం కళాశాలలో వైద్యం అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ ఎమ్ వి రమణయ్య మాట్లాడుతూ పేదవారు వేలకువేలు ఖర్చుపెట్టి నెల్లూరు వెళ్లి వైద్యం చేయించుకుంటున్నారని తెలిపారు. వారికోసం ఆత్మకూరు పట్టణంలోని పరిసర ప్రాంతాల పేద ప్రజల కోసం ఈ వైద్య శిబిరం నిర్వహిస్తున్నామని తెలిపారు. ఆత్మకూరు అపోలో లేబోరేటరీ క్లినిక్ ద్వారా సుగర్ టెస్ట్ చేయించుకున్న వారికి రూ.25 ఆహారం తిన్న తర్వాత రెండోసారి కూడా చేయించుకునే వారికి రూ.25లతో పరీక్షలు నిర్వహిస్తామన్నారు. ఇన్సులిన్ ఒకటి రూ.80లకు మాత్రమే ఇస్తామన్నారు. రెండు నెలలకు ఒకసారి అవసరమైన మందులు కేవలం రూ.200లకు మాత్రమే మందులు ఇస్తున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని ఆత్మకూరు పట్టణ ప్రజలు, చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని డాక్టర్ తెలిపారు.. జోరు వర్షంలో కూడా దాదాపు 100మంది పేషెంట్లు వచ్చే వైద్యం పొందారని ఆయన తెలిపారు. కార్యక్రమంలో జెవివి నాయకులు మురళీకృష్ణ, హరికృష్ణ, మల్లి, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ సంధాని, సిపిఎం పట్టణ కార్యదర్శి డేవిడ్ రాజు, తదితరులున్నారు.



సిబ్బందికి సూచనలు చేస్తున్న కమిషనర్ గంగా ప్రసాద్

శానిటైజేషన్ పనులు పరిశీలన

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్

రానున్న రెండు రోజులు పెంగల్ తుపాన్ ప్రభావం ఉండొచ్చని ప్రజలు జాగ్రత్తలు పాటించాలని మున్సిపల్ కమిషనర్ గంగా ప్రసాద్ అన్నారు. ఆదివారం ఉదయం ఐదు గంటలకు మున్సిపల్ పరిధిలోని బస్టాండ్ సెంటర్, సత్రంసెంటర్ తదితర ప్రాంతాలలో శానిటైజేషన్ సిబ్బంది కాలువలు, పూడికతీత పనులను చేస్తుండగా ఆ పనులను మున్సిపల్ కమిషనర్ గంగా ప్రసాద్ సిబ్బందికి సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న రెండురోజుల్లో తుపాన్ ప్రభావం ఎక్కువగా ఉండడం వల్ల కాలువలో నీరుపొంగి బయటకు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని శానిటైజేషన్ వర్కర్లకు, సిబ్బందికి సూచనలు ఇచ్చారు.


వర్షపాతం వివరాలు

ప్రజాశక్తి-కావలి

కావలి డివిజన్‌లో ఆదివారం 371.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. మండలాల వారీగా వివరాలు ఇలా ఉన్నాయి. కావలి 22.8, బోగోలు 38.2, అల్లూరులో70.4, దగదర్తిలో 62.6, కలిగిరి మండలంలో 14.6, వింజమూరులో 6.2, దుత్తలూరు 3.0, విడవలూరులో 51.6, కొడవలూరులో అత్యధికంగా 82.8 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదు అయింది. అయితే కావలి నియోజకవర్గంలో 194 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైనట్లు కావలి ఆర్.డి.ఒ. కార్యాలయ వర్గాలు తెలిపాయి.

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్ : ఫెయింజల్ తుపాను కారణంగా ఆదివారం ఆత్మకూరు డివిజన్ పరిధిలోని 9 మండలాల్లో 173.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు. సీతారామపురం మండలంలో 2, మర్రిపాడు 6.2, చేజర్ల 30.6, ఆత్మకూరు 31.6, ఉదయగిరి 2.8, ఎఎస్‌పేట 21.6, అనంతసాగరం 17.4, సంగం 51.4, కలువాయి 41.8 మిల్లీమీటర్లు వర్షపాతం నమోదైనట్లు వివరించారు. సగటున 19.3 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు.

భోజన ప్యాకెట్లు వితరణ



ప్రజాశక్తి-కావలి : కావలి పట్టణం నివాసులు బండారు వంశీ వారి తండ్రి బండారు.వెంకయ్య జ్ఞాపకార్థంగా సంయుక్త సేవాసంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు సురేంద్ర ద్వారా కావలి పట్టణం తుపాన్ నగర్లోని జంగాల కాలనీలోని పేదలకు భోజనం ప్యాకెట్లు వితరణ చేయించారు. ఈ సందర్భంగా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు సురేంద్ర మాట్లాడుతూ తమ సంస్థ ద్వారా పేదలకు ఆకలి తీర్చిన దాత బండారు. వంశీకి హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేస్తూ ఉన్నామని తెలిపారు.

బురదమయంగా రోడ్డు..



- రోడ్డు కోసం కోటపాడువాసుల ఎదురుచూపులు

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్

గత ఎన్నో యేళ్లుగా ఆ గ్రామస్తులు రోడ్డు కోసం పోరాటాలు చేస్తున్నా.. ఇప్పటి వరకు వారికి ఫలితం మాత్రం కనిపించలేదు. మండలస్థాయి నుండి జిల్లాస్థాయి అధికారుల వరకు, స్థానిక నాయకుల నుండి అమాత్యుల వరకు అందరిని కలిసి తమ గోడు వెళ్లబోసుకున్నా.. ఇంతవరకు ఆ గ్రామానికి రోడ్డు నిర్మాణం మాత్రం జరగలేదు. అదే ఆత్మకూరు మండలం మహిమలూరు మజరా కోటపాడు గ్రామం.

ప్రధానంగా కోటపాడు గ్రామం నుండి మహిమలూరులోని పాఠశాలకు ప్రతినిత్యం 15 నుండి 20మంది విద్యార్థులు చదువుకునేందుకు వెళ్తుంటారు. అయితే వర్షం వస్తే ఆ గ్రామం నుండి మహిమలూరుకు వెళ్లాలంటే నడిచే పరిస్థితి కూడా కనిపించదు. అత్యవసరంగా గ్రామం నుండి పెద్దలు ఎవరైనా వెళ్లాలంటే కూడా పరిస్థితి దారుణంగా ఉంటుంది. ఈ నేపథ్యంలో గత సంవత్సరం జూలైలో ఆ ప్రాంత విద్యార్థులు పెద్దఎత్తున నిరసన కార్యక్రమాన్ని చేపట్టి తమ గ్రామానికి సిసిరోడ్డు మంజూరు చేయాలంటూ నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. అంతేకాకుండా అదే సంవత్సరం సెప్టెంబర్‌లో ఆత్మకూరు రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో జరిగిన ప్రజా విజ్ఞప్తుల దినంలో అప్పటి జిల్లా కలెక్టర్ హరినారాయణన్ దృష్టికి తమ సమస్యను నేరుగా కలిసి విన్నవించారు.

చిన్నారి విద్యార్థులు తమ గ్రామ సమస్యను తెలుసుకున్న కలెక్టర్ 2023 నవంబర్ 1వ తేదీ మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామి పథకం ద్వారా రూ.74లక్షలతో సిసిరోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేశారు. 2024 మార్చి 31 నాటికి పనులు పూర్తి చేసే విధంగా పంచాయతీరాజ్ అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. అయితే ఇప్పటి వరకు ఆ గ్రామానికి సిసిరోడ్డు నిర్మాణ పనులు చేపట్టేందుకు ఎవరూ ముందుకు రాలేదు. ముందుకు వచ్చిన వారికి ఎన్‌ఆర్‌జిఎస్ కింద విడుదల చేసిన పనులకు కూలిల వాటా ఉందని, దానిని తాము ఇప్పించలేమంటూ తెలపడంతో పనులు చేసేందుకు ఏ కాంట్రాక్టరు ముందుకు రాని పరిస్థితి నెలకొందని ఆరోపణలు వినిపించాయి. అయితే ఇటీవల కురిసిన వర్షాలతో మళ్లీ ఆ గ్రామానికి సమస్య నెలకొంది. ఏడాది కాలంగా తమ గ్రామ సమస్యను అందరి దృష్టికి తీసుకెళ్లిన ఆ విద్యార్థులు, గ్రామస్తులు మళ్లీ తమ ఆందోళన కొనసాగించేందుకు సిద్ధమయ్యారు. ఇప్పటికైనా అధికారులు, పాలకులు తమ గ్రామానికి సిసిరోడ్డును త్వరితగతిన ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఎంఎల్ఎపై విమర్శలు తగవు

ప్రజాశక్తి-ఉదయగిరి



మాట్లాడుతున్న నాయకులు

శాసనసభ్యులు కాకర్ల సురేష్, పిఎలపై బురదజల్లడు వ్యాఖ్యులు విమర్శలు చేయడం 40యేళ్లలో జరగని అభివృద్ధిని ప్రస్తుతం అడ్డుకోవడమేనని మండల ఉపాధ్యక్షురాలు మట్ల శాంతి పేర్కొన్నారు. ఆదివారం స్థానిక ఎస్‌టి కాలనీవాసులతో కలిసి విలేకరులతో మండల ఉపాధ్యక్షురాలు మట్ల శాంతి, మట్ల రామయ్య, లక్ష్మయ్య, అంకయ్య మాట్లాడుతూ జరుగుతున్న ఆనకట్ట ఆధునీకీకరణ పనులపై వెల్లువెత్తిన వదంతులను నమ్మి శాసనసభ్యులు కాకర్ల సురేష్, పిఎలపై గిట్టని వ్యక్తులు బురద జల్లే ప్రయత్నం చేస్తున్నారని అలాంటి ప్రయత్నాలు మానుకోవాలని మెట్టప్రాంత అభివృద్ధికి సహరిచాలని హితవు పలికారు. ముఖ్యంగా టిడిపి కుటుంబ సభ్యులు ఈ పరిణామాలు గుర్తించి లేనిపోని అవాస్తవాలను నమ్మవద్దని ఆమె కోరారు. గత ప్రభుత్వంలో స్థానిక ట్యాంక్ బండ్ ఆధునికీకరణ పనులు మంజూరయ్యాయని ఆ పనులను నూతన కాంట్రాక్టర్‌కు అప్పగిస్తే అనుభవం లేకపోవడం వల్ల పనుల్లో జాప్యం జరగవచ్చని అందుకే ఆ పనులు తొందరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలనే కాంక్షతో పాత కాంట్రాక్టర్‌కే పనులు అప్పగించారన్నారు. ఇందులో ఎలాంటి స్వార్థం లేదని, అది ప్రత్యేకంగా టిడిపి కుటుంబ సభ్యులతోపాటు టిడిపిపై బురదజల్లే మిత్రులు కూడా గమనించాలని గుర్తుచేశారు. టిడిపి ఎప్పుడు ప్రజల పక్షానే ఉంటుందే తప్ప మిగతా ఆలోచన పార్టీకి, శాసనసభ్యులకు లేదని వారన్నారు. పార్టీలోనే ఉంటూ పార్టీపై, శాసనసభ్యులపై అసత్య ప్రచారాలు చేస్తేవదిలిపెట్టేది లేదని మరొకసారి వారు హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్‌టి కాలనీ మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



రగ్బీ ఆడుతున్న క్రీడాకారులు

రాష్ట్రస్థాయి రగ్బీ పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి-కావలి

కావలిలోని మద్దూరుపాడు డి.బి.ఎస్. ఇంజనీరింగ్ కళాశాలలో ఆదివారం రెండో రాష్ట్రస్థాయి మినీ సబ్ జూనియర్ అండర్ -12 ఛాంపియన్‌షిప్ పోటీలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆంధ్రప్రదేశ్ బేస్‌బాల్, అసోసియేషన్ అధ్యక్షుడు మల్లికార్జున రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని పోటీలను లాంఛనంగా ప్రారంభించారు. చిన్నపిల్లలకు ఇలాంటి పోటీలు నిర్వహిస్తే భవిష్యత్తులో క్రీడా కారులుగా రాణించే అవకాశం ఉందని ఆయన ఆశ భావాన్ని వ్యక్తం చేశారు. 14 జిల్లాల నుంచి బాల బాలికలు పోటీల్లో పాల్గొనడం తమకెంతో ఆనందంగా ఉందన్నారు. రాష్ట్ర రగ్బీ సంఘం ప్రధాన కార్యదర్శి రామాంజనేయులు మాట్లాడుతూ రాష్ట్ర నలుమూలల నుంచి వచ్చిన క్రీడాకారులకు ఆయన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో డి.బి.ఎస్. ఇంజనీరింగ్ కళాశాల బాధ్యులు దామోదర్, ఆయా జిల్లాల రగ్బీ ప్రతినిధులు చంద్రశేఖరరావు, యాసిన్, శంకర్, వంశీ, మురళి, తదితరులు పాల్గొన్నారు.

బోరుకు మరమ్మతులు




ప్రజాశక్తి-ఎఎస్‌పేట : మండలంలోని అనుసముద్రం గ్రామ పంచాయతీ సమీపంలోని వినాయక సెంటర్‌లో మరుగున పడిపోయిన బోర్ పంపును ఆ గ్రామ ఆటో యూనియన్ నాయకులు సురేష్ నాయకత్వంలో బాగు చేయించారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ గత నాలుగు సంవత్సరాల నుంచి ప్రధాన కూడలి వద్దనున్న బోర్ పంపు మరుగున పడిపోవడంతో, గతవారం క్రితం పంచాయతీ అధికారులకు తెలియజేయడంతో వారు స్పందించి బోర్ మెకానిక్ ద్వారా బాగు చేయించారని తెలియజేశారు. కార్యక్రమంలో మేత రాహుల్, గరికపాటి విష్ణు, సాయి, సోమవరపు చరణ్, మస్తానయ్య, తదితరులు పాల్గొన్నారు.

డాక్టరేట్‌కు 'కానగల' ఎంపిక

ప్రజాశక్తి-అనంతసాగరం : మండలంలోని పాతాళపల్లి గ్రామానికి చెందిన ఆగ్నేష్ మల్టీ పర్పస్ డెవలప్‌మెంట్ సొసైటీ అధ్యక్షులు కానగల వెంకట రమణయ్యకు ఇంటర్నేషనల్ ఫీస్ యూనివర్సిటీ గౌరవ డాక్టరేట్‌తో సన్మానించ బోతున్నారు. తన చుట్టుపక్కల ఉన్న వారిని ఆదుకుంటూ జీవితాన్ని కొనసాగిస్తూన్న వ్యక్తులకు సమాజంలో తప్పకుండా గుర్తింపు లభిస్తుంది. అలాంటి వ్యక్తులలో వెంకట రమణయ్య ఒక్కరు. ఈ డాక్టరేట్‌ను 7న తమిళనాడులోని ఊటీలో గమ్‌పార్క్ హోటల్‌లో ఆయనకు అందించనున్నారు.

ప్రజలపై మోపిన భారాన్ని తగ్గించండి..

ప్రజాశక్తి-వింజమూరు



మాట్లాడుతున్న వైసిపి నాయకులు

రాష్ట్రంలోని ప్రజలందరికీ ఎన్నికల సమయంలో ఇచ్చిన నెరవేర్చాలని ప్రజల నెత్తిన మోపిన భారాన్ని తగ్గించాలని వింజమూరు మండల వైసిపి నాయకులు జెడ్‌పిటిసి గణపం బాలకృష్ణారెడ్డి ప్రభుతాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం వైసిపి నాయకులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. గత ముఖ్యమంత్రి వైసిపి అధ్యక్షులు వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వాన్ని ఎన్నికల సమయంలో నోటికొచ్చినట్లుగా విమర్శలు చేసి, ఆనాటి రాష్ట్ర ప్రభుత్వంలో ప్రజలందరూ ఇబ్బందులకు గురయ్యారని, తమ ప్రభుత్వం వచ్చిన వెంటనే ప్రజలందరూ సూపర్‌సిక్స్ పథకం ద్వారా ప్రజలకు అన్ని విధాలుగా మేలు జరుగుతుందని తాము అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రజలపైన ఎలాంటి భారాలు మోపకుండా అధిక ధరలను ఛార్జీలను పెంచబోమని ముఖ్యంగా కరెంటు ఛార్జీలను ఐదు సంవత్సరాల పాటు పెంచేది లేదని తెలిపారు కానీ అధికారంలోకి వచ్చిన వెంటనే ఎన్నికల్లో ఇచ్చిన హామీలను తుంగలోతొక్కి ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా, వచ్చే పథకాలను సైతం ఆపేశారన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాష్ట్ర ప్రజలకు ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నీ వెంటనే నెరవేర్చాలని తెలిపారు. మోసపూరిత మాటలతో హామీలతో అధికారంలోకి వచ్చి ప్రజలను అన్ని విధాలుగా గురిచేస్తున్నారన్నారు. ఉదయగిరి నియోజకవర్గం వైసిపి ఇన్‌ఛార్జి మేగాపాటి రాజగోపాల్ రెడ్డి ఆదేశాల మేరకు నియోజకవర్గంలోని అన్ని మండలాల నాయకులు కార్యకర్తలు ఎన్నికలలో ప్రజలకు ఇచ్చిన హామీలపైన తిరుగుబాటు కార్యక్రమాన్ని నిర్వహించి ప్రజల పక్షాన నిలబడాలని పిలుపునిచ్చారన్నారు. అందులో భాగంగానే ఈ సమావేశాన్ని ఏర్పాటు చేసినట్లు తెలియజేశారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ శ్రీనివాస్ రెడ్డి, రవీందర్ రెడ్డి, మాజీ సొసైటీ అధ్యక్షులు విజయ్ కుమార్ రెడ్డి, మద్దూరు బాబు, చెన్న కృష్ణారెడ్డి, పి ప్రసాద్ రెడ్డి, రోడ్ల కొండయ్య, బైపి రెడ్డి, బిజీయా, గోపి, వైసిపి కార్యకర్తలు పాల్గొన్నారు.